క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


మౌనిక

బత్తలపల్లి: అంతర్రాష్ట్ర జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం వెంకటనాయుడు, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 14 వరకు బిహార్ రాజధాని పాట్నాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బీఎస్ఎఫ్ బలగాల కవాతు

బత్తలపల్లి: ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ కమాండర్ సీహెచ్ జోషఫ్, సీఐ రాఖేష్‌కుమార్, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

గిరిజన జనగర్జన సభ విజయవంతం చేయండి


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఈనెల 10 న పుట్టపర్తిలో నిర్వహించ తలపెట్టిన గిరిజన జన గర్జన సభను విజయ వంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన జన గర్జన సభకు గిరిజనులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కుల్లాయప్ప నాయక్, జాయింట్ సెక్రటరీ గిరిధర్ నాయక్, గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు కాలే జయరాం నాయక్, ముదిగుబ్బ సేవేనాయక్, కదిరి రాధా కృష్ణానాయక్, సర్పంచులు సరోజ నాగేనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రవినాయక్, నల్లమాడ ఎంపీపీ అంజీనాయక్, ముదిగుబ్బ తిరుపాల్ నాయక్, మాజీ స్టేట్ సెక్రటరీ లక్ష్మానాయక్, వైస్ సర్పంచ్ బాబునాయక్, పెడపల్లి అశ్వర్థ నాయక్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఔదార్యం


జేసీబీతో రోడ్డు చదును చేయిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని కలికివాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త డి.జయరామిరెడ్డి ఔదార్యం చాటుకున్నారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న కలికివాండ్లపల్లి గ్రామం నుంచి కలికివాండ్లపల్లి కొట్టాలకు మూడు కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సొంత నిధులతో నాలుగు ట్రాక్టర్లలో మట్టిని తరలించారు. జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగింపు పనులు చేయించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో సుమారు రూ.లక్ష సొంత నిధులు వెచ్చించి రోడ్డును బాగు చేసినట్లు జయరామిరెడ్డి తెలిపారు.

వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత

అమడగూరు: గాజులపల్లి సమీపంలో ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి కదిరికి చెందిన పలువురు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ 12 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను వితరణగా ఇచ్చారు. శశిధర్, హను, సతీష్, సునీల్, గోల్డ్ శివ, దినేష్, అంజన్‌రెడ్డి శుక్రవారం ఆశ్రమానికి చేరుకుని నిర్వాహకురాలు అరుణజ్యోతికి సరుకులను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసే నాగార్జున తదితరులు ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరిందన్నారు. టీడీపీ, జనసేన ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచ్ మీనుగ నాగరాజు, నాగార్జున, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభోశంకర


ప్రత్యేక అలంకరణలో కొత్తపేట ఉమామహేశ్వరస్వామి


ఎన్పీకుంట మండలం గౌకనపల్లిలో పూజలందుకున్న శివుడు


అలంకరించిన కోన మల్లికారున స్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివాలయాలన్ని శివనామస్మరణతో మారుమోగాయి. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివానగర్ బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథస్వామి ఆలయం,గాంధీనగర్ సహస్ర సిద్ధరామలింగేశ్వర స్వామి ఆలయం, గీతానగర్ శివాలయం, అరిగెల పోతన్న రైస్‌మిల్ పక్కనున్న శివకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కొత్తపేట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివునికి క్షీరాభిషేకం చేశారు. చెరువుకట్ట సమీపంలోని కాశీవిశాలాక్షి కాశీ విశ్వనాథస్వామి ఆలయం, చెరువుకట్ట చక్ర సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయం, పేట బసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వరుని ఆలయం,చక్రవర్తి థియేటర్ వద్దనున్న కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆయాల్లో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వాములు దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. ధనియానిచెరువు భైరవేశ్వరస్వామి, గౌకనపల్లి, పెడబల్లి గ్రామాలలో వెలసిన శివాలయాల్లో స్వామికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కదిరి టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సైదాపురం అంజనేయస్వామి ఆలయం, ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయం, వాసవీమాత, మరకత మహాలక్ష్మి ఆలయం, శివాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తనకల్లు: మండల కేంద్రంలోని శివాలయంతో పాటు కనసానివారిపల్లి భైరాగిస్వామి ఆలయం, బాలసముద్రం జంబు లింగేశ్వరస్వామి ఆలయం, ఈతోడు శివాలయంలో శుక్రవారం శివరాత్రి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న వివిధ ఆలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

నల్లమాడ: మహా శివరాత్రి వేడుకలను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నల్లమాడ, వంకరకుంట సమీపంలోని భవనాశినీ ఆశ్రమం, రాగానిపల్లి శివాలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమాడ శివాలయంలో నిర్వాహకులు అగిశం ప్రతాప్ ఆధ్వర్యంలో భజనలు చేశారు. పూజారి వెంకటరమణ ఆధ్వర్యంలో నల్లమాడ, చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల్లో పోతులయ్య స్వామి విగ్రహాన్ని ఊరేగించారు.

యలవగంపలకు ప్రత్యేక పూజలు..

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వీరనారాయణస్వామి యలవగంపలకు అడుగడుగున భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామాపురానికి చెందిన వీరనారాయణస్వామి పూజారులు బుక్కపట్నం మండలం పాముదుర్తి నుంచి శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని పత్రపల్లి, ఎం.అగ్రహారం, మరవపల్లి, తాడిమర్రి, కునుకుంట్ల, రామాపురం మీదుగా నార్పల మండలం ముచ్చుకుంటపల్లికి చేరుకున్నారు. యలవగంపలకు గ్రామ, గ్రామాన భక్తులు వారపడ్డారు.

తాడిమర్రి: తాడిమర్రిలోని పురాతన శివాలయం, భైరవేశ్వర ఆలయం, తూర్పు చెరువుకట్ట వెలసిన శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుండలిని సిద్ధ మహాయోగి రమ్యదేవి శక్తిపాత్ ఆధ్యాత్మిక ఆశ్రమంలో మర్రిచెట్టుకింద పరమ శివుని విగ్రహం ప్రతిష్టించారు. చిల్లవారిపల్లి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, ఎం.అగ్రహారం, ఆత్మకూరు, నార్శింపల్లి, పిన్నదరి శివాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనగానపల్లి/రామగిరి/చెన్నేకొత్తపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో శివరాత్రి సందడి నెలకొంది. కనగానపల్లిలోని మల్లికార్జునస్వామి, తగరకుంటలోని మల్లన్నస్వామి, ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయం, పర్వతదేవరపల్లిలో మల్లికార్జునస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామగిరి మండలంలోని పేరూరు, నసనకోట, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి గ్రామాల్లోని శివాలయాల్లో జాగరణ జరిగింది. చెన్నేకొత్తపల్లిలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు మంజునాథ్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, అభిషేకం, తదితర పూజలు చేపట్టారు. కోన మల్లికార్జున స్వామికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం శివ పార్వతులకు కల్యాణం జరిపించారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

ముదిగుబ్బ: గుంజేపల్లి వద్ద వున్న కన్యకలగొందిలో శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్య లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నేత శివశంకర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ముదిగుబ్బలోని హరహర గణేష్ ఆలయంలో శివునికి అభిషేకాలు పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన తిమ్మమ్మమర్రిమాను

ఎన్పీకుంట: శివరాత్రి జాగరణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిమ్మమ్మమర్రిమాను ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు అమ్మవారికి గంధాభిషేకం చేసిన అనంతరం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తిమ్మమ్మఘాట్, గంగరాజులకోట, శివప్రాజెక్టు భక్తులతో సందడిగా మారింది. జాగరణలో భాగంగా శుక్రవారం రాత్రి మంగదిన్నెపల్లి రమణప్పనాయుడు బృందం తిమ్మమాంబ, బాలవీరయ్య జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో ప్రదర్శించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

బత్తలపల్లి: స్థానిక లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని స్వామి దేవస్థానంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, జాంపుల సూర్యనారాయణ, జాంపుల అలువేలమ్మ దంపతులు, పార్వతి తరపున వైఎస్సార్‌సీపీ నేతలు పోతుల శంకర్‌రెడ్డి, పోతుల నాగమణి, షరాబ్ యోగానంద ఆచారీ, షరాబ్ భవానీ దంపతులు ఎదురుకోళ్లోత్సవం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఇదిలా ఉండగా రామాపురం, మాల్యవంతం, సంఘమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వర క్షేత్రాలతోపాటు పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు, గంటాపురం అప్పస్వామి, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్లలోని చెన్నకేశవాలయం, యర్రాయపల్లిలోని సంగాలప్పస్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు జరిగాయి.వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సంఘమేశ్వర క్షేత్రంలో పంచరత్నాలు నాటకం, బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ ఓంకారేశ్వరస్వామి ఆలయం వద్ద ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో దశరత్నాలు నాటకాన్ని ప్రదర్శించారు.


యలవలగంపలకు వారపడిన మహిళలు


తిమ్మమ్మకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు


శివున్ని తీసుకువస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు దంపతులు

మృతునికి ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: రాగానిపల్లికి చెందిన వల్లం ఆదినారాయణ(61) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆదినారాయణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య ఆదిలక్ష్మమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు ఉంట్ల లక్ష్మీపతిరెడ్డి, రఘునాథరెడ్డి, ఆదినారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆనంద్, రవీంద్ర తదితర నాయకులున్నారు. ఇదిలా ఉండగా చంద్రాయునిపల్లికి చెందిన వెంకటరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద కోలుకొంటున్నాడు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి వెంకటరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాయకులు నరసింహామూర్తి, నారపరెడ్డి, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ఎగువపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిరుపాల్‌నాయుడు అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీటీసీ కుమార్‌నాయుడు, నాయకులు గరుడప్ప తదితరులు ఉన్నారు.

కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అండ


రామిరెడ్డిని పరామర్శిస్తున్న మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: ప్రమాదవశాత్తూ గాయపడిన ఇందుకూరువారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామిరెడ్డికి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అండగా నిలిచారు. రామిరెడ్డి కాలికి తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మక్బూల్ అహ్మద్ శుక్రవారం బాధితుడిని పరామర్శించి వైద్యం కోసం ఆర్థిక సాయం అందజేశారు. అలాగే సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి రామిరెడ్డిని పరామర్శించి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, మండల కన్వీనర్ హైదర్‌వలి, జేసీఎస్ కన్వీనర్ షమీవుల్లా, సింగిల్ విండో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కల్లిపల్లి శ్రీనివాసులు, శ్రీకంఠరెడ్డి, నిరంజన్‌రెడ్డి, బావాఖాన్, పోలం సూర్యశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధు, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు

నల్లమాడ: ఆర్.రామాపురం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుధారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4–30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో అరగంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

దోచుకోవడమే పరిటాల నైజం



సింగంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలను ఇబ్బందులకు గురి చేసి దోచుకోవడమే పరిటాల కుటుంబం నైజమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సింగంపల్లిలో మొదటగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం సింగంపల్లి తండా, వై.కొత్తపల్లిలో ప్రచారం సాగించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు ప్రజలు పూలు చల్లుతూ డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2024లో చంద్రబాబు ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేశారన్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు నీరు చెట్టు ద్వారా రూ.లక్షల్లో దోచుకున్నారని ఆరోపించారు. మంత్రిగా పని చేసిన పరిటాల సునీత, వాళ్ల సోదరులు, వాళ్ల బంధువులు కూడా అవినీతికి పాల్పడి రూ.వందల కోట్లు దోచుకున్నారన్నారు.

ప్రజలకు ఏం కావాలన్నా వాళ్ల గడప తొక్కాల్సిందే..

నియోజకవర్గ ప్రజలకు ఏం కావాలన్నా పరిటాల గడప తొక్కాల్సిన పరిస్థితి గతంలో ఉండేదని తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో పారదర్శకంగా పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గాలిమరల విషయంలో రైతులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గాలిమరలకు 3.50 ఎకరాలకు కంపెనీ వారు రూ.65 లక్షలు ఇస్తుంటే పరిటాల సునీత కొడుకు సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్ పేరుతో రూ.65 లక్షలు తీసుకుని రైతులకు రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. సిద్దరాంపురం, సింగంపల్లి గ్రామాల్లో కమ్మ వర్గానికి చెందిన వారికి కూడా చీనీ చెట్లకు సంబంధించి లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌గా అందించామన్నారు. మంత్రిగా ఉన్న పరిటాల సునీత పేరూరు డ్యాంకు నీరు తీసుకురాలేని మనిషిగా మిగిలిపోయిందన్నారు. మేము అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చామని పేర్కొన్నారు. సోలార్ మెగా పార్కు, గార్మెంట్ పరిశ్రమకు శ్రీకారం చుట్టామన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. రైతులకు ఉచితంగా బోర్లు వేశామన్నారు. రూ.117 కోట్లతో రోజుకు 16 గంటలు నీరు అందించేలా శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 17 వేల మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రకాష్‌రెడ్డి పేరు చెబితే ఇవన్నీ గుర్తుకు వస్తాయని.. పరిటాల కుటుంబం పేరు చెబితే చెప్పుకునేందుకు ఏమీ లేవన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, నీలిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కాశీ విశ్వనాథుడి రథోత్సవం


ఉత్సవమూర్తులను పల్లకీలో మోస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు

ధర్మవరం అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శివానగర్‌లోని అతి పురాతనమైన బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయం వద్ద శుక్రవారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. పార్వతి, పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి నూతన రథంపై కొలువుదీర్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు ఉత్సవమూర్తులను పల్లకీపై మోసుకుంటూ రథంపై కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజల నడుమ ఎమ్మెల్యే కేతిరెడ్డి దంపతులు మడుగు తేరును లాగారు. మధ్యాహ్నం వరకు ఆలయం వద్దనే రథాన్ని ఉంచడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. శివానగర్‌లోని దిమ్మెల సెంటర్ వరకు ఎమ్మెల్యేతోపాటు ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు రథాన్ని లాగారు. ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, ఉక్కిశిల గోవిందరాజులు, గుర్రం రాజా, శంకర్ యుగంధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి

ధర్మవరం అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మిని ఘనంగా సన్మానించారు. అలాగే సాయినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మానవతా సంస్థ ఆధ్వర్యంలో మహిళా వైద్యులు శ్వేత, ప్రియాంక, శ్రావణి, సాయి చంద్రిక, హెల్త్ కమ్యూనిటీ ఆర్గనైజర్లు సునిత, జ్యోతి, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు ముత్యాలమ్మ, సేవా కార్యకర్త కళావతిలను మానవతా సంస్థ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్ పద్మల ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

కదిరి టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ శ్రీదేవి,నర్సింగ్ సూపరింటెండెంట్ వలసలాదేవిని సిబ్బంది సన్మానించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి సాధ్యమని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటిఎల్ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీ ఆర్డీటీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

టీడీపీ నేతల మాయమాటలు నమ్మొద్దు


17వ వార్డులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో కొన్నింటిని, ఇతర రాష్ట్రాల నుంచి కొన్నింటిని కాపీ కొట్టి సూపర్ సిక్స్ పథకాలంటూ టీడీపీ నాయకులు చెబుతున్న మాయమాటలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో ఇర్ఫాన్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు వార్డు ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన 57 నెలల్లో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఇందుకోసం కదిరిలో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వెలవెలబోతున్న శంఖారావం సభలు..

వైఎస్సార్‌సీపీ ఎన్నికల సభలు జనసముద్రాన్ని తలపిస్తుంటే నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభలు జనం లేక వెలవెలబోతున్నాయని మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై శంఖారావంలో నారా లోకేష్ చేసిన ఆరోపణలు ఖండించారు. టీడీపీ హయాంలో కదిరి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి మహమ్మద్ షాకిర్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూలశ్రీనివాసరెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, నాయకులు జిలాన్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, పరికి సాధిక్‌బాషా, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రామగిరి: చెర్లోపల్లి ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాలు.. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే గురువారం రాత్రి సొంత నిధులతో బోరు వేయించారు. రెండు ఇంచుల నీరు పడినట్లు రామకృష్ణారెడ్డి, సూరి కాలనీవాసులు తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

నల్లచెరువు: చిన్న పల్లోల్లపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓరువాయి గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు దాటుతున్న అతడిని కదిరి నుంచి తిరుపతికి వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పట్టువస్త్రాల సమర్పణ

కదిరి టౌన్: కడప జిల్లా పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున డిప్యూటీ కమిషనర్,ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు శుక్రవారం సమర్పించారు. వీరబ్రహ్మేంద్ర దేవస్థానం ఫిట్ పర్సన్ శంకర్ పాల్గొన్నారు.

